క్లుప్తంగా

పోలీసుల సోదాలు

గార్లదిన్నె: గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు. సోమవారం కనంపల్లిలో తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈసందర్భంగా పాత నేరస్తులు, అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ, కెమిస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సాకత్ ఆలీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వతేదీ లోపు దరఖాస్తును కళాశాలలో అందించాలని సూచించారు.

ఊరి దేవర ప్రశాంతంగా జరుపుకోండి

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లిలో ఈ నెల 18న జరిగే ఊరి దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. సోమవారం కొజ్జేపల్లి గ్రామస్తులతో పోలీసుస్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేవర సందర్భంగా గ్రామాల్లో చిన్నపాటి విషయంపై అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎలాంటి చిన్న సమస్య ఉన్నా పోలీసులకు లేదా 100 కు డయల్ చేయాలని సూచించారు.

ఘనంగా వ్యవసాయ పండుగ ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం వ్యవసాయ పండుగ ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. సీఎస్ఐ గుత్తి డివిజనల్ చైర్మన్, పామిడి పాస్టర్ జీ డేవిడ్‌నాయక్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యవసాయం చేసి మానవుడు మనుగడ సాధించేందుకు దేవుడు భూమిని సృష్టించాడని, నూతన సంత్సరాదిన పండిన పంట అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పుట్లూరు: బాలాపురం క్రాస్ వద్ద సోమవారం 94 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. యల్లనూరు మండలం తిమ్మంపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ద్విచక్రవాహనంపై మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్లు, బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామంలో గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు రంగస్వామి పశుగ్రాసాన్ని ఇంటి సమీపంలో వామి వేసి ఉంచాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు వామికి నిప్పుపెట్టారు. గమనించిన ఇతర రైతులు మంటలను చూసి కేకలు వేసి అందరిని అప్రమత్తం చేశారు. గుంతకల్లు అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసే లోగా వరి గడ్డి మొత్తం కాలిపోయి పనికి రాకుండా పోయింది. రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఎడ్లబండ్ల ర్యాలీ



సీబీరోడ్డులో ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

తాడిపత్రి టౌన్: పట్టణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల ర్యాలీ ఆకట్టుకుంది. స్థానిక శివాలయం వీధిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి గాంధీకట్ట, మెయిన్ బజార్, అశోక్‌పిల్లర్, సీబీరోడ్డు, గాంధీసర్కిల్, యల్లనూర్ రోడ్డుసర్కిల్, అంబేడ్కర్ విగ్రహం, నంద్యాల రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు(రామాంజి), మండల కమిటీ సభ్యులు రాజారామిరెడ్డి, బాల నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



పామిడిలో అమ్మవార్ల గ్రామోత్సవ దృశ్యం



బుక్కరాయసముద్రం: బహుమతులను అందజేస్తున్న రమణారెడ్డి



తాడిపత్రి టౌన్ :గాలి పటాలతో ఆడుకుంటున్న వాసవీ క్లబ్ సభ్యులు



గుత్తి రూరల్: ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి



చిన్నవడుగూరులో ఉట్టి కొడుతున్న యువకుడు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు, గాజులపల్లి, రజాపురం, బాచుపల్లి, కొజ్జేపల్లి, బసినేపల్లి, గొందిపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున లేచి నూతన దుస్తులు ధరించి ఆలయాలకు తరలివెళ్లి పూజలు చేశారు. తొండపాడు బొలికొండ రంగనాథస్వామి, బాచుపల్లి బాట సుంకలమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రంగనాథ స్వామి ఆలయంలో అర్చకులు రవికుమార్ గో పూజ నిర్వహించారు. యువకులు క్రికెట్, యువతులు తాడాట, ఊయలలు ఊగుతూ సంతోషంగా గడిపారు.

గుంతకల్లుటౌన్: సంక్రాంతి పండుగను ఆదివారం పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, పాత గుంతకల్లు రామలింగేశ్వరస్వామి, వినాయక స్వామి ఆలయాలకు భక్తులు వెళ్లి పూజలు నిర్వహించారు. రైతులు అత్యధికంగా ఉండే పాతగుంతకల్లులో సంక్రాంతిని సంబరంగా జరుపుకున్నారు. సోమవారం కనుమ సందర్భంగా యేడాది పొడవునా తమ కష్టంలో పాలుపంచుకున్న పశువులకు రైతన్నలు పూజలు నిర్వహించారు.

యల్లనూరు: పల్లె ముంగిట్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం వేకువజామున నుంచి ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరణ, హరిదాసుల వాయిద్యాలతో కొత్త శోభ సంతరించుకుంది. ఇదిలా ఉండగా తిరుమలాపురం గ్రామంలో టీపీఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మైటీవారియర్స్ యోగనంద జట్టుపై రాయల్స్ లెవెల్ వినోద్ బృందం గెలుపొందింది. వినోద్ బృందానికి సర్పంచు అజ్జుగుట్టు రామాంజులరెడ్డి ట్రోఫీ అందజేశారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ప్రజలు ఆదివారం మకర సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం కనుమ పండుగ సందర్భంగా రైతన్నలు పశువులకు పూజలు చేశారు.

యాడికి: మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. చందన గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం లయన్స్, లియోక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు పట్టుచీరలు, మిగిలిన వారికి కన్సోలేషన్ బహుమతులను లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు.

పామిడి: పామిడిలో ఆదివారం మకర సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. కనుమ పండుగను పురస్కరించుకొని కాల గమనంలో ఉత్తరాయణ పుణ్యకాలంలో మొదటిరోజు సూర్య గమనాన్ని సూచిస్తూ వీధిలో సూర్య రథం ఇంటిముందు కదలిన వేళను తలపించేలా ముగ్గులు వేశారు. ఇదిలా ఉండగా కొండూరురోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ గ్రామదేవతల ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు భక్తాదులు కాయ, పండ్లు సమర్పించి పూజించారు.

తాడిపత్రి టౌన్ : పట్టణంలో ఆదివారం, సోమవారం సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు చోట్ల సంక్రాంతి పండుగను తెలిపేలా ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి, షిర్డీసాయిబాబా, చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాలి పటాల పోటీలు నిర్వహించారు. స్థానిక శివాలయం వీధిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కనుమ పండుగను పురస్కరించుకుని ఆలయంలో గోమాతకు ఆలయ అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిల్వ అలంకారంలో బుగ్గ రామలింగేశ్వరుడుని అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు రాఘవేంద్రారెడ్డి, రమేష్, హరిప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు శంకరయ్య పాల్గొన్నారు.

సంప్రదాయాలను పరిరక్షించాలి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ సాంస్కృతీ సంప్రదాయాలను పరి రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం చెదుల్ల గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మొదటి బహుమతి స్మార్ట్ టీవీ, ద్వితియ బహుమతి బీరువా, తృతీయ బహుమతి మంచం, నాల్గవ బహుమతి డ్రెస్సింగ్ టేబుల్, 5వ బహుమతి టేబుల్ ఫ్యాన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంజినేరెడ్డి, కాలువ నారాయణస్వామి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రుషింగప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి, నాగలింగ, రాములప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలవ్యాప్తంగా సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నవడుగూరు గ్రామంలో చెగువేరా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం ర్వహించారు. ఏటా ఉట్టి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాల ఓబిలేసు తెలిపారు. పండుగ విశిష్టత రాబోవు తరానికి గుర్తుండేలా చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆశాజనకంగా పప్పుశనగ



యల్లనూరు సమీపంలో సాగు చేసిన పప్పుశనగ పంట

యల్లనూరు: అన్నదాతలకు ఈ సారి అన్ని పంటలు అనుకూలంగానే ఉన్నాయి. పప్పుశనగ, వరి, కందులు, పొద్దుతిరుగుడు, దానిమ్మ, అరటి తదితర పంటలు దిగుబడులు వచ్చాయి. ఏటా ఏదో తెగుళ్ల రూపంలో అన్నదాతలకు నష్టాలు మిగిల్చేవి. ప్రస్తుతం అన్నదాతలు సాగు చేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మంచి దిగుబడులు వస్తాయనే ఆశలో రైతులు ఎదురు చూస్తున్నారు. యల్లనూరు మండలవ్యాప్తంగా పప్పుశనగ 7,600 ఎకరాలు, వేరుశనగ 300 ఎకరాలు, వరి 100 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పప్పుశనగ పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. యల్లనూరు, జంగంపల్లి, పాతపల్లి, వెంకటాద్రిపల్లి, వెన్నపూసపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా రైతులు పప్పుశనగ పంట సాగు చేశారు. పప్పుశనగ పంట కోత దశకు చేరుకుంది.

కళలకు ఆదరణ అమోఘం



కళాకారుడికి ఎస్వీ స్మారక అవార్డును అందజేస్తున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు రూరల్: కళలకు నాటికీ, నేటికీ ఎన్నిటికీ ఆదరణ ఉంటుందని డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు, స్వర్గీయ ఎస్వీ ప్రసాద్ యాదవ్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో రాష్ట్రస్థాయి ఎస్వీ స్మారక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కైకాల సత్యనారాయణ, సూపర్ స్టార్ కృష్ణ వంటి ఎంతోమంది మహానటులు గతించినప్పటికీ వారు నటించిన సినిమాలు, వారి నటన ఎన్నటికీ బతికే ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా మద్దికెరలో జన్మించిన ఎస్వీ ప్రసాద్ యాదవ్ చిన్ననాటి నుంచే నాటకాలు, నటన పట్ల ఆకర్షితుడయ్యాడన్నారు. ఎన్నో నాటకాలు, సినిమాల్లో నటించిన ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అనంతరం రంగస్థల నటుడు, రిటైర్డ్ తహసీల్దార్ వెంకట చలపతి, లక్ష్మీపతిని ఎస్వీ స్మారక అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్, రిటైర్డ్ తహసీల్దార్ రాముడు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కోటవీధి సమీపంలో కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి రథోతవ్సం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు లక్ష్మీనరసింహస్వామి రథాన్ని ఆలయం వద్ద నుంచి మెయిన్ బజారు, షిర్డీసాయిబాబా ఆలయం, గాంధీ సర్కిల్ మీదగా రాయల్ సర్కిల్ వరకు తిరిగి అటు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు లాగారు. ఇదిలా ఉండగా సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ధర్మాపురంలో తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు



తెగిపడిన విద్యుత్ తీగలు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామ సమీపంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. వన్నేదొడ్డి గ్రామంలో ఉన్న పవర్ గ్రిడ్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి సరఫరా అయ్యే 400 కేవీ విద్యుత్ తీగలు ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా తెగిపడ్డాయి. తీగలు తెగి పంట పొలాల్లో పడటంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో రైతులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలను చూసిన స్థానికులు వెళ్లి చూడగా తీగలు తెగిపడినది చూసి పవర్ గ్రిడ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఎన్టీపీసీ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం తెగిన తీగలకు మరమ్మతు చేశారు. ఎన్టీపీసీ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ తీగలు తరచూ తెగి పడుతున్నాయని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు తెలిపారు. సంఘటనపై ఎన్టీపీసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

వైభవంగా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం



ఆలూరు కోనలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు,



రెడ్డివారిపాలెంలో గోదాదేవి, కోదండరంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి టౌన్: మండలంలోని ఆలూరు కోన రంగసాథస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా సంక్రాంతి గోదాదేవి, రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రాల మధ్య స్వామి కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరు రామచంద్రారెడ్డి, సభ్యుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా గోదాదేవి, కోదండ రంగనాథస్వామి కల్యాణం

తాడిపత్రి టౌన్: స్థానిక రెడ్డివారిపాలెంలోని కోదండ రంగసాథస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, కోదండ రంగనాథస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి, కోదండ రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను పుట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుల వేద మంత్రాల మధ్య స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

కమనీయం కల్యాణోత్సవం

గుత్తి: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో సోమవారం రాత్రి ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం కమనీయంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా తో పాటు కుటుంబ సభ్యులు కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో వేద పండితులు వాసుదేవ శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.26.10 లక్షలు పలికిన టెంకాయల వేలం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: బాచుపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో సోమవారం టెంకాయల వేలం పాట రూ.26.10 లక్షలు పలికింది. ఏడాది పాటు ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి ఆలయ కమిటీ వేలం పాట నిర్వహించింది. వన్నేదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య రూ.26.10లక్షలకు వేలం దక్కించుకున్నాడు. ఆలయ కమిటీ సభ్యులు కర్లకుంట రమేష్ నాయుడు, అంబటి నరశింహులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటరామిరెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనపై 19 నుంచి వీడియో కాన్ఫరెన్స్

గుత్తి: పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై విద్యుత్ వినియోగదారులతో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

బెంచీల వితరణ

గుత్తి: పట్టణంలోని వీర జవాన్ వడ్డే ఆంజనేయులు విగ్రహం వద్ద ప్రజలు కూర్చొవడానికి వీలుగా మాజీ సీఆర్‌పీఎఫ్ కుళ్లాయి బెంచీలను సోమవారం వితరణ గావించారు. బెంచీలను ఏఎస్ఐ రామచంద్రరెడ్డికి అందజేశారు. వాటిని వెంటనే వీర జవాన్ వడ్డే ఆంజనేయులు విగ్రహం వద్ద ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్ మిత్ర బృందం సభ్యులు రాజు, కుద్దూస్, దాదా, గోవిందు,అన్వర్, బేల్దారి కుళ్లాయి, విజయ్, ఇసాక్, జావీద్, చెన్నారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నల్లమ్మ ఆలయానికి విరాళం



నగదు అందిస్తున్న వంశీగోకుల్‌రెడ్డి

శింగనమల: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని తరిమెల గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్న నల్లమ్మ జాతరకు వైఎస్సార్‌సీపీ నేత తరిమెల వంశీగోకుల్ రెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. గ్రామంలో జాతరను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని కోరారు.

నేడు శింగనగుట్టపల్లిలో పెద్దమ్మ జాతర

పెద్దపప్పూరు: మండలంలోని శింగనగుట్టపల్లిలో 80 ఏళ్ల తరువాత పెద్దమ్మ అమ్మవారి జాతరను మంగళవారం నిర్వహించేందుకు గ్రామస్తులు భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చాగల్లు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన ఆగ్రామాన్ని మరొక చోట పునః నిర్మాణం చేయించారు. నూతన గ్రామంలో అమ్మవారి జాతరను నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యగా ఎస్ఐ ఖాజాహుస్సేన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు అంకాలమ్మ జాతర

పామిడి: పట్టణంలోని పీ కొండాపురంరోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ జాతరను ఈనెల 17,18వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. తొలిరోజు పాలపళ్ల విభాగం, 18న న్యూ కేటగిరి విభాగానికి సంబంధించి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. పాలపళ్ల విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఉంటాయన్నారు. అలాగే న్యూ కేటగిరి విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందిస్తామని వివరించారు.

21న నిరంజన గురురంగస్వామి ఆరాధన

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో ఈ నెల 21న నిరంజన గురు రంగస్వామి 87వ ఆరాధన నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

పామిడి: పట్టణంలోని పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను సోమవారం సాయంత్రం డీఎస్పీ నర్సింగప్ప పరిశీలించారు. ఈనెల 22న పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, మోడల్‌స్కూల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఆయా కేంద్రాల్లో సౌకర్యాలపై సమీక్షించారు. డీఎస్పీ వెంట సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

గొర్రెల కాపరుల ఘర్షణ

గుత్తి రూరల్: ఇసురాళ్లపలిలో సోమవారం గొర్రెల కాపరుల మధ్య ఘర్షణ జరిగి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ప్రసాద్, రాజగోపాల్ గొర్రెలు పెంచుకుంటూ జీవనం సాగించేవారు. అయితే సోమవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి కర్నూలు జిల్లాకు చెందిన కొందరు మేతకు గొర్రెలను తీసుకొచ్చారు. గ్రామ సమీపంలో ఉన్న గడ్డి తమ గొర్రెలకే సరిపోవడం లేదని గొర్రెలకు మేత కోసం ఇతర గ్రామాల నుంచి వస్తే ఎలా అని ప్రసాద్, రాజగోపాల్ ప్రశ్నించారు. దీంతో గొడవ జరిగి ఇసురాళ్లపల్లికి చెందిన చంద్ర, కోటిలు కర్నూలు జిల్లా గొర్రెల కాపరులకు మద్దతుగా వెళ్లి ప్రసాద్, రాజగోపాల్‌పై దాడి చేశారు. గాయపడ్డ వారిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.